క్లుప్తంగా

నిబంధనలు పాటించకపోతే చర్యలు



విజయలక్ష్మి ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్ : ప్రైవేటు ఆసుపత్రుల్లో నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని ఆర్డీఓ మహేష్ నిర్వాహకులను హెచ్చరించారు. పట్టణంలోని స్పందన ఆసుపత్రి, దేవిన ర్సింగ్‌హోమ్, విజయలక్ష్మి ఆసుపత్రులను ఆర్డీఓ శుక్రవారం తనిఖీ చేశారు. ఆస్పత్రుల్లోని స్కానింగ్ సెంటర్లను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. లింగ నిర్ధారణ చేయరాదన్న నోటీస్ బోర్డులను ఆసుపత్రి వెలుపల ఏర్పాటు చేయాలని సూచించారు. ఆసుపత్రులకు వచ్చే రోగులను మర్యాదగా పలకరించి వైద్యసేవలు అందించాలన్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సెలియా సాల్మన్ ఉన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మానాయక్

నల్లమాడ: రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మానాయక్ తనిఖీ చేశారు. రికార్డులను, ల్యాబ్‌ను పరిశీలించారు. డెంగీ, మలేరియా కేసులపై సిబ్బందితో ఆరా తీశారు. రెడ్డిపల్లిలో జరుగుతున్న డ్రై డే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. జోనల్ హెల్త్ విస్తరణాధికారి నిత్యపూజయ్య, ఫీల్డ్ అధికారి మహబూబ్ బాషా, మలేరియా సబ్ యూనిట్ అధికారి దేవళనాయక్, సూపర్‌వైజర్ శశిధర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ముదిగుబ్బ: ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ సిబ్బందికి జోనల్ మలేరియా అధికారి లక్ష్మానాయక్ సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీతో పాటు మలకవేమల క్రాస్‌లోని పీహెచ్‌సీని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. డాక్టర్లు స్వేత, లక్ష్మీ, సిబ్బంది వేణుగోపాల్ రెడ్డి, వెంకటనారాయణ తదితరులు ఉన్నారు.

'సంస్కృతి' విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి సమీపంలోని సంస్కృతి విద్యాసంస్థలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్న 28 మంది విద్యార్థులు టెక్ మహీంద్రలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల యాజమాన్యం పేర్కొంది. ఇటీవల కళాశాలలో నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో టెక్ మహీంద్ర హెచ్‌ఆర్ విశాల్ విన్సెంట్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన 28 మందికి శుక్రవారం ఆఫర్ లెటర్లు అందజేశారు. ఏడాదికి రూ.3.38 లక్షల వేతనంతో వీరంతా పూణే, నోయిడా శాఖల్లో పని చేయనున్నట్లు కళాశాల యాజమాన్యం పేర్కొంది.

'ఉపాధి'లో అవినీతి బట్టబయలు

కనగానపల్లి: మండలంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో రూ.1,81,916 అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీలో వెల్లడైంది. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శుక్రవారం 18 విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. అడిషనల్ పీడీ శివశంకర్ ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. కొలతల్లో తేడాలు, మస్టర్‌లో కూలీల సంతకాలు, హాజరు లేకుండా వేతనాలు చెల్లింపులు, మస్టర్లు హాజరు గణన లెక్కింపుల్లో తప్పిదాలు, పని ప్రదేశంలో తేడాలు గుర్తించినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా రూ.1,81,916 అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీడీ వెంకటచలపతి, ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, ఎంపీడీఓ అనిల్ కుమార్, ఎస్ఆర్పీ చంద్రమోహన్, ఏపీఓలు పాల్గొన్నారు.

యువకులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నారాయణరెడ్డి

కదిరి టౌన్: పట్టణంలో రాత్రి పూట జులాయిగా తిరుగుతూ గొడవలు సృష్టించే నలుగురు యువకులకు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి కౌన్సిలింగ్ ఇచ్చారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు యువకులతోపాటు వారి తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ మురళీకృష్ణ వద్ద బైండోవర్ చేయించారు. పట్టణంలో రాత్రి 10 గంటల తర్వాత షాపుల నిర్వహణకు అనుమతి లేదని సీఐ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే షాపుల యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

వేమన ఆలయం.. సమస్యల విహారం

- పర్యాటక శాఖ నిర్లక్ష్యం
- అధ్వానంగా పార్కు
- పిచ్చిమొక్కలతో నిండిన ఆలయ ప్రాంగణం
- పర్యాటకులకు తప్పని తిప్పలు

గాండ్లపెంట: పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి గాంచిన వేమన ఆలయం ప్రాంగణంలో సమస్యలు విహారం చేస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో పర్యాటకులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పర్యాటక ప్రదేశాల్లో కటారుపల్లి వేమన ఆలయం ఒకటి. కదిరి లక్ష్మీనరసింహస్వామి, తిమ్మమ్మ మర్రిమాను, లేపాక్షి, పుట్టపర్తి తదితర ప్రాంతాలకు వచ్చే పర్యాటకులు ఇక్కడికి తప్పనిసరిగా వస్తుంటారు. దీంతో పాటు వేమనను ఇలవేల్పుగా భావించే వేలాది మంది వేమన సమాధిని దర్శించుకుంటుంటారు. దీంతో ఈ ప్రాంతం నిత్యం సందడిగా ఉంటుంది.

వైఎస్సార్ హయాంలో ఆలయ పునరుద్ధరణ..

2008లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వేమన ఆలయ పునరుద్ధరణకు రూ.3 కోట్లు మంజూరు చేశారు. ఆ నిధులతో 4 విడిది గృహాలు, పున్నమి రెస్టారెంట్ సదుపాయాలు కల్పించారు. ప్రాంగణంలోనే పర్యాటకులు సేద తీరేందుకు పార్కు, పిల్లల కోసం ఆడుకునేందుకు ప్రత్యేక పరికరాలు ఏర్పాటు చేశారు. మొదట్లో విడిది గృహాలు, రెస్టారెంట్ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించేవారు. అనంతరం నష్టాలు వస్తున్నాయని ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇచ్చారు. పార్కు నిర్వహణను పట్టించుకోకపోవడంతో ముళ్లపొదలు పెరిగిపోయాయి. మరోవైపు పరికరాలు తుప్పుపట్టి చిన్నారులు ఆడుకునేందుకు పనికిరాకుండా పోయాయి. ఆలయం చుట్టూ నిర్మించిన ప్రహరీ కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. నిర్వహణ లేకపోవడంతో ఆలయ ప్రాంగణం పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ఏటా ఉగాది అనంతరం వేమన బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. అప్పటిలోగానైనా ఆలయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పర్యాటకులు, భక్తులు కోరుతున్నారు. ఈ విషయంపై పర్యాటకశాఖ డివిజనల్ మేనేజర్(కర్నూలు) చంద్రమౌళేశ్వరరెడ్డిని ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



విడిది గృహాల ఎదుట పెరిగిన పిచ్చిమొక్కలు



ప్రాంగణంలో కూలిపోయిన ప్రహరీ



పార్కులో తుప్పుపట్టిన పరికరాలు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



వేమన సమాధి అయిన ప్రాంతానికి ఎంతో మంది భక్తులు, యాత్రికులు వచ్చిపోతుంటారు. ఆలయ పరిసరాలు ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో కళావిహీనంగా ఉన్నాయి. పర్యాటకశాఖ అధికారులు ఆలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి. ప్రహరీ కూలినా అధికారులు పట్టించుకోవడంలేదు.

– బొద్దిపోగుల ఉత్తన్న, గొల్లపల్లి కటారుపల్లి

పార్కును అందుబాటులోకి తీసుకురావాలి



పర్యాటక అధికారులు కేవలం ఆదాయం మీద తప్ప పర్యాటకులకు సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారించడం లేదు. ఆలయ ప్రాంగణంలోని పార్కును అందుబాటులోకి తీసుకురావాలి. పిల్లలు ఆడుకునేందుకు పరికరాలు ఏర్పాటు చేయాలి.

–వద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి, కటారుపల్లి

ఫీజు పోరును జయప్రదం చేయండి



ఫీజుపోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: ఫీజు రీయింబర్స్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 5న జిల్లా కేంద్రంలో తలపెట్టిన ఫీజుపోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేసేందుకు కంకణం కట్టుకుందన్నారు. విద్యా దీవెన కింద రూ.2,800 కోట్లు, వసతి దీవెన కింద రూ.1100 కోట్లు బకాయిలు పెట్టిందన్నారు. ఫలితంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమానికి పెద్దసంఖ్యలో విద్యార్థులు తరలిరావాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ విద్యార్థి విభాగ్ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, రాష్ట్ర సహాయ కార్యదర్శి వేముల అమర్‌నాథ్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకులు కోటి సురేష్‌బాబు, మాసపల్లి సాయికుమార్, చందమూరి నారాయణరెడ్డి, పెణుజూరు నాగరాజు, గజ్జల శివ, బూశెట్టి రామకృష్ణ, సీపీ నారాయణరెడ్డి, భాస్కర్, చిల్లకొండయ్యపల్లి అశ్వర్థ, గంగాధర్ నాయుడు, డి చెర్లోపల్లి క్రిష్ణ, సాయినాథ్‌రెడ్డి, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

'టౌన్ ప్లానింగ్' అవినీతిపై వాడీవేడి చర్చ

- టీపీఓ అవినీతిపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల మండిపాటు
- ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ తీర్మానం
- తీర్మానానికి ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి ఆమోదం



టీపీఓను సరెండర్ చేయాలని ఛైర్‌పర్సన్‌కు తీర్మాన ప్రతిని అందిస్తున్న కౌన్సిలర్లు

ధర్మవరం: మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో అవినీతిపై కౌన్సిల్ సమావేశంలో వాడీవేడి చర్చ జరిగింది. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ భవనంలో కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో టీపీఓ సాయిప్రసాద్ అవినీతిని కౌన్సిలర్లు ఆధారాలతో సహా చూపించారు. సదరు అధికారిని ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ కౌన్సిలర్లు తీర్మానం చేశారు. మెజారిటీ సభ్యులు అంగీకారం తెలపడంతో ఛైర్‌పర్సన్ ఆమోదం తెలిపారు. పట్టణాభివృద్ధికి ఎంతో కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుంటే మున్సిపల్ అధికారులు అనుమతి ఇవ్వకపోవడంపై వైస్ ఛైర్మన్ వేముల జయరామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు పార్టీల కతీతంగా ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఇప్పుడు ఇలా మున్సిపల్ అధికారులు కూటమి పార్టీల నాయకులకు ఒత్తాసు పలుకుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు.

మాస్టర్‌ప్లాన్ రోడ్ల వివరాలు తెలియజేయండి

కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, గోరకాటి పురుషోత్తంరెడ్డి, పెణుజూరు నాగరాజు, గజ్జల శివ, ఎర్రగుంట భాగ్యలక్ష్మి, నీలూరి వెంకటరాముడు, చింతా యల్లయ్య, జేసీబీ రమణ తదితరులు మాట్లాడుతూ మున్సిపాలిటి పరిధిలో మాస్టర్‌ప్లాన్ రోడ్ల వివరాలు ప్రజలకు తెలియక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలందరికి మాస్టర్ ప్లాన్ రోడ్ల వివరాలను తెలియజేయాలన్నారు. జాతీయ నాయకుల విగ్రహాల చుట్టూ రాజకీయ పార్టీల నాయకులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి కనపడకుండా చేస్తున్నారన్నారు. పట్టణంలోని డివైడర్ల మధ్యలో చెత్తను వేసి మొక్కల సంరక్షణను మరిచారన్నారు. వీధిలైట్ల కొరత, పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని ఛైర్‌పర్సన్‌హామీ ఇచ్చారు. మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ షంషాద్ బేగం కో ఆప్షన్ సభ్యులు బూశెట్టి రామకృష్ణ, మెప్మా టీపీఓ విజయభాస్కర్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



కదిరిలో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

తాడిమర్రి: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్యులు శుక్రవారం వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య ముత్తయిదువులు వీరభద్రయ్యస్వామి ఆలయం నుంచి 101 కలశాలతో పవిత్ర గంగా జలాన్ని తెచ్చి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

తలుపుల: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆర్యవైశ్యులు నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకుడు లక్ష్మినరసింహశాస్త్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీరాములుశెట్టి, నాయకులు రామకృష్ణశెట్టి, రమణయ్య శెట్టి, కుళ్లాయప్ప శెట్టి, రవికుమార్, భక్తకుమార్, ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: కన్యక పరమేశ్వర వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్నిఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు కాలినడకన వాసవీమాత ఆలయానికి వెళ్లి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు కలశాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆర్డీఓ వీవీఎస్ శర్మ, బీజేపీ నేత వంశీకృష్ణ, ఆర్యవైశ్య సంఘం నేతలు పాల్గొన్నారు.

తనకల్లు: వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ శోభ సువర్ణమ్మ పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాండురంగస్వామి ఆలయం నుంచి మహిళలు 102 కలశాలతో ఊరేగింపు వచ్చి అమ్మవారికి సమర్పించారు. వాసవీ మహిళా మండలి సభ్యులు లలితా సహస్రనామం, విష్ణు సహస్రనామ పారాయణం చేపట్టారు.

దళితులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



తాడిమర్రిలో మాట్లాడుతున్న ఎస్‌ఐ కృష్ణవేణి

తాడిమర్రి: చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్‌ఐ కృష్ణవేణి దళితులకు సూచించారు. స్థానిక ఎస్సీ కాలనీలో శుక్రవారం ఆమె సిబ్బందితో కలసి పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో అగ్రవర్ణాలు, ఇతర సామాజిక వర్గాల నుంచి కుల వివక్షకు గురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. అవసరమైన వారికి ప్రభుత్వం ఉచితంగా న్యాయ సహాయం అందిస్తుందని తెలిపారు.

బత్తలపల్లి: ఎస్సీ, ఎస్టీలు అన్యాయానికి గురైతే పోలీసులను ఆశ్రయించాలని తహసీల్దార్ స్వర్ణలత, ఎస్‌ఐ సోమశేఖర్ సూచించారు. శుక్రవారం వెంకటగారిపల్లి ఎస్సీ కాలనీలో సివిల్ రైట్స్ డేలో భాగంగా ప్రజల ప్రాథమిక హక్కులపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈఓఆర్డీ క్రిష్టప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెత్తందార్లు వెట్టి చాకిరీ చేయించడం, దౌర్జన్యాలు చేస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

కదిరి అర్బన్: కదిరికుంట్లపల్లి హరిజనవాడలో ఎంపీడీఓ పోలప్ప ఆధ్వర్యంలో పౌరహక్కులపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి, ఎంఈఓ చెన్నకృష్ణ పౌర హక్కులపై అవగాహన కల్పించారు.

నల్లమాడ: యర్రవంకపల్లి తండాలో తహసీల్దార్ రంగనాయకులు ఆధ్వర్యంలో శుక్రవారం సివిల్ రైట్స్ డేపై అవగాహన సమావేశం నిర్వహించారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యులు, న్యాయవాది కే. వీరనారాయణ, సీఐ నరేంద్రరెడ్డి పౌరహక్కులు బాల్య వివాహాల నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఓడీచెరువు: స్థానిక ఆర్టీటీ కాలనీలో శుక్రవారం సివిల్ రైట్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ అనంతాచారి, ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ కుల వివక్షపై కాలనీ వాసులతో ఆరా తీశారు. ఆర్ఐ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో న్యామద్దెల గ్రామాల్లో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. రామగిరి సీఐ శ్రీధర్, ఎస్‌ఐ సత్యనారాయణ, తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీఓ శివశంకరప్ప పౌరుల హక్కులపై అవగాహన కల్పించారు. ఎక్కడైనా కులవివక్ష చూపితే తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యాసంస్థల బంద్ జయప్రదం



మెడకు ఉరితాడు బిగించుకుని నిరసన తెలుపుతున్న ఐక్యవిద్యార్థి సంఘాల నేతలు

కదిరి అర్బన్: ఇంటర్ విద్యార్థి చరణ్ మృతికి కారణమైన నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతం అయింది. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల నేతలు పట్టణంలోని నారాయణ పాఠశాల వద్ద ఉరితాడు మెడకు వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను నారాయణ కళాశాలకు చదువులకు పంపిస్తే కళాశాల యాజమాన్యం ఆ బిడ్డలను శవాలుగా ఇళ్లకు పంపిస్తోందన్నారు. విద్యార్థి మృతికి కారణమైన నారాయణ కళాశాలను సీజ్ చేసి మంత్రి పదవి నుంచి నారాయణను తొలగించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌ఎస్‌యూ జిల్లా నాయకులు చల్లా చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాబ్జాన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శేషం మహేంద్ర, నాయకులు గణేష్, అఖిల్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తాం



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి: గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. ఈనెల 18వ తేదీన 'ప్యాచ్.. అంతా టూచ్' శీర్షికతో అధ్వానంగా ఉన్న రోడ్లపై సాక్షిదినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. పిఆర్.కొట్టాల (పిచ్చిరెడ్డి కొట్టాల) గ్రామానికి బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే పరిటాల సునీత భూమిపూజ చేశారు. ఎగువపల్లి నుంచి పిఆర్.కొట్టాల మీదుగా కొత్తగ్యాదికుంట వరకూ 5 కిలోమీటర్ల రోడ్డు వేసేందుకు నాబార్డ్ నిధులు రూ.3 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. అలాగే పిఆర్.కొట్టాలలో రూ.29.50 లక్షల ఉపాధిహామీ నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, ఎల్.నారాయణచౌదరి పాల్గొన్నారు.

వీఓఏకు అవార్డు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో స్త్రీ నిధి కింద అత్యధికంగా రూ.79 లక్షలు రుణాలు అందించడంతోపాటు వంద శాతం రికవరీ సాధించిన చెన్నేకొత్తపల్లి మండలం కనుముక్కల వీఓఏ టి.మంజులకు అవార్డు దక్కింది. ఈ మేరకు శుక్రవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో పీడీ నరసయ్య మంజులకు అవార్డు అందజేశారు. కార్యక్రమంలో ఏజీఎం వేణుగోపాల్, డీపీఎం రామమోహన్, మేనేజర్ జగన్, సీసీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కదిరి అర్బన్: అలీపూర్‌తండా సమీపంలోని కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీఓఈ) గిరిజన ప్రతిభా కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరామానాయుడు శుక్రవారం తెలిపారు. ఫిబ్రవరి 3 నుంచి మార్చి 3 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. మార్చి 9న ప్రవేశపరీక్ష ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు ఉంటుందన్నారు. రాయలసీమలోని గిరిజన బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 8309005097, 8309486312 నంబర్లలో సంప్రదించాలన్నారు.

'సరుకులు సరిగా ఇవ్వడం లేదు'

బత్తలపల్లి: చౌకధాన్యపు డిపోలకు సరుకులు సరిగా ఇవ్వడంలేదని మండలంలోని డీలర్లు పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని డీలర్లు తహసీల్దార్ స్వర్ణలత, సీఎస్‌డీటీ రామకృష్ణతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీలర్లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా ఇంకా బఫర్ అందజేయలేదన్నారు. రేషన్ బియ్యం లారీ వచ్చినప్పుడు హమాలీలు డబ్బు అధిక మొత్తం కావాలని వేధిస్తున్నారన్నారు. ఒక ప్యాకెట్ బియ్యం బస్తాలో 44 నుంచి 46 కేజీలు బియ్యం సరఫరా అవుతున్నాయన్నారు. సంబంధిత అధికారులతో చర్చించి న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

స్టోర్ డీలర్ల సంఘం మండలాధ్యక్షుడిగా సోమిరెడ్డి

బత్తలపల్లి: స్టోర్ డీలర్ల సంఘం మండలాధ్యక్షుడిగా సోమిరెడ్డి ఎన్నికయ్యారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సంఘం నూతన మండల కమిటీ ఎన్నిక జరిగింది. ఓబుళాపురం స్టోర్ డీలర్ సోమిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నట్లు ప్రకటించారు. అనంతరం సోమిరెడ్డి మాట్లాడుతూ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

సంక్షిప్త సమాచారం

డ్రిప్పు, స్ప్రింక్లర్ల మొత్తాన్ని ఆన్‌లైన్‌లో చెల్లించండి

కదిరి అర్బన్/ తలుపుల: సబ్సిడీ డ్రిప్పులు, స్ప్రింక్లర్ల కోసం ఆన్‌లైన్ లేదా బ్యాంకులో డీడీ ద్వారా చెల్లించాలని కదిరి, తలుపుల ఎంఐఏఓలు చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రారెడ్డి శుక్రవారం తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొంతమంది కంపెనీ పేర్లు చెప్పుకుని రెండు మూడు రోజుల్లో మెటీరియల్ పంపిస్తామని రైతుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారన్నారు. రైతులు వీరిపట్ల జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు.

పశు ఆరోగ్య శిబిరం

గాండ్లపెంట: పాయకట్టు, బొలిగుట్లపల్లిలో శుక్రవారం పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పశువైద్యాధికారి కేశవనాయక్ మాట్లాడుతూ ఈ నెల 21న ప్రారంభమైన శిబిరాల్లో ఇప్పటి వరకూ 2035 పశువులకు చికిత్సలు, 75,230 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశామన్నారు. పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.

మహిళపై వ్యక్తి దాడి

బత్తలపల్లి: ఇంటి దగ్గర ఒంటరిగా ఉన్న మహిళపై వ్యక్తి దాడి చేసిన ఘటన బత్తలపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితరాలు తెలిపిన సమాచారం.. విద్యాధరి పాఠశాల ఎదురుగా నివాసం ఉంటున్న సుహాసిని అనారోగ్యంతో ఇంటి వద్ద ఉంటోంది. సాయంత్రం అశోక్ అనే వ్యక్తి ఇంటివద్దకు వెళ్లి తలుపు గట్టిగా బాదడంతో ఆమె మందలించింది. మద్యం మత్తులో ఉన్న అతడు కట్టెతో ఆమెపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు.

దుకాణాలపై దాడులు

ధర్మవరం అర్బన్ : పట్టణంలోని దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై శుక్రవారం మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా 18 కేజీల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకోవడంతోపాటు రూ.6 వేలు జరిమానా విధించినట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యాంసన్, కేశవ, కార్యదర్శులు పాల్గొన్నారు.

నాలుగో రోజూ దరఖాస్తులు నిల్

పుట్టపర్తి టౌన్: ప్రభుత్వం గీత కులాలకు కేటాయించిన 9 మద్యం దుకాణాల లైసెన్స్‌ల జారీకి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించి నాలుగురోజులైనా దరఖాస్తులు రాలేదు. జిల్లా వ్యాప్తంగా 8 ఎక్సైజ్ స్టేషన్లు ఉన్నాయి. రెండు చెక్‌పోస్టుల పరిధిలో గీత ఉపకులాల వారీగా రిజర్వ్ చేస్తూ మద్యం దుకాణాలకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

ముదిగుబ్బ: దామానుపల్లిలో శుక్రవారం జగజ్యోతి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. అర్చకుడు శివకుమార్ స్వామి బృందం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.

కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయండి

బత్తలపల్లి: కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలియజేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం ఎంతో మంది ఎదురుచూస్తున్నారన్నారు. రేషన్‌కార్డు లేని వారు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, మండల కార్యదర్శి బండల వెంకటేష్, ఏపీ కార్మిక సంఘం జిల్లా నేత మాల్యవంతం కుళ్లాయప్ప, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బత్తల నాగభూషణ, వడ్డె సన్నపెద్దన్న, సత్యప్ప, నారాయణ, ఆదెప్ప, వెంకటప్ప, కేశవరెడ్డి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

నంది విగ్రహం అపహరణ

తనకల్లు: మండల కేంద్రంలోని బ్యాంకు బజార్‌లో ఉన్న పురాతన నంది విగ్రహం శుక్రవారం అపహరణకు గురైంది. స్థానిక కరెంట్ బిల్లులు చెల్లించే కార్యాలయం వద్ద రోడ్డుపై ఉన్న నంది విగ్రహాన్ని దుండగులు వెలికితీసి తీసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు.